

# పుస్తక పరిచయం




**చక్కటి, చిక్కటి** కవిత్వం వ్రాసే వర్తమాన రచయిత్రులలో ముందు వరుసలో చూడదగిన కవయిత్రి డా.కె.గీత. ఈ 'శతాబ్ది వెన్నెల' ఆమె వెలువరించిన మూడవ స్వీయకవితా సంపుటి. ఇందులోని కవితలన్నీ ప్రవాసదేశం నుంచీ వ్రాసినవే ఐనా స్వచ్ఛమైన స్వదేశీ హృదయం ఉంది ఈ కవితల నిండా. ఈ కవయిత్రి కలంలో ఏ సందర్భమైనా అద్భుతమైన కవితగా రూపుదిద్దుకుంటుంది. సరికొత్త పదప్రయోగాలతో, విభిన్నమైన పదచిత్రాలతో హృదయాన్ని తడిమే భావాలతో ప్రతికవితా చదువుతున్న ప్రతిసారీ సరికొత్తగా కనిపిస్తుంది. దాచుకుని మరీ చదవాలనిపించే ఆత్మీయత ఈ కవితల్లోని ఆత్మ. ఈ పుస్తకానికి మకుటమైన 'శతాబ్ది వెన్నెల' 'స్థిమితంగా పసిపాపతో ఆడుకునే అద్భుతమైన వర్తమాన సందర్భం' ! తనలో పెరుగుతున్న పాపాయితో సంభాషించే మాతృహృదయాన్ని ఆవిష్కరించిన ఈ కవితలో 'నీ రూపంలో నేను మళ్ళీ / ఓ వందేళ్ళు పోగు చేసుకుంటాను / నీ నించి ప్రవహించే రక్తమై పరిణామం చెంది / శతాబ్దాల తరబడి జీవించే ఉంటాను / కృతజ్ఞతలు పాపాయీ!' అంటారు కవయిత్రి. తల్లి రూపం ఒకతరం నుంచి మరో తరానికి రక్తకణమై ప్రవహిస్తూనే ఉంటుంది, అందుకే అది ఒక పక్షపు వెన్నెల కాదు - అది శతాబ్ది వెన్నెల! విదేశంలో తనని చూడ్డానికి వచ్చి తిరిగి వెళ్ళిపోతున్న అమ్మకి వీడ్కోలు చెబుతూ ' ఆరు నెల్ల కంటే ఎక్కువ పరాయిదేశం పర్మిటించదు / ఒకసారి నీ నించి విడిపడిన పుత్రికా రత్నం నీతో వెనక్కి ప్రయాణించదు / అయినా చివరి నిమిషంలో వెనకే పరుగెత్తి రావాలనిపించింది / మళ్ళీ ఒకసారి నీ కడుపులోకి ప్రవహించి హాయిగా నిద్రించాలనిపించింది' అంటారు. కడుపులోకి ప్రవహించడం లాంటి ప్రయోగాలు ఈ కవయిత్రికి సొంతగొంతుక నిస్తున్నాయి. ఈ కవితల్లో ఒక తల్లి, ఒక పాపాయి, ఒకనేస్తం, ఒక పథికురాలు, ఒక యాత్రికురాలు..ఎంతోమంది విభిన్నమైన కోణాల్లో దర్శనమిస్తారు. చాలామందికి తోచని సన్నివేశాలెన్నో డా.గీతగారి సృజనలో అందమైన కవితలౌతాయి. పుస్తకం చదవడం పూర్తయేసరికి మనసు ఆర్ద్రమౌతుంది. మరోసారి పుటలని వెనక్కి తిప్పాలనిపిస్తుంది.

***

*Copies available at:*

***Visalandhra Book House***
***Prajashakti Book House***
***Navodaya Book House***

*Writer Contacts:*
kgeetamadhavi@gmail.com
USA Phone: 408-483-7700




**దాసరాజు రామారావుగారి** 'పట్టుకుచ్చుల పువ్వు' ఆలోచింపచేసే కవితల సంపుటి. అనుభూతి కంటే మనసుని నిలదీసే కవితలే ఈ సంపుటిలో అధికశాతం ఉన్నాయి. కవి హృదయం లోతుల్లోంచి పెల్లుబుకిన గంభీర భావాలకి ప్రతిరూపం ఇందులోని ప్రతి కవిత. ముందు మాటలో వరవరరావుగారు చెప్పినట్లు ఈ కవితలన్నింటిలోనూ ఎక్కువగా కనిపించే మూలభావం 'మనిషిలోని మనిషితనం పరాయీకరింపబడడం గురించి పడిన ఆవేదన'. ఈ కవితల్లోని శిల్పం గురించి వ్రాస్తూ వరవరరావుగారు 'ఒక సుకుమారమైన సున్నితమైన భావశబలత, ఎటువంటి గడ్డురోజుల్లోను సమతాసుందరి భవిష్యత్ స్వప్నాలను చూడగల ఊహ, కవితోహ పరుచుకుని ఉంటుంది' అని పేర్కొన్నారు. రచయిత రామారావుగారు తెలంగాణా ఉద్యమంలోని పలుకోణాలని కవితారూపంలో వ్యక్తీకరించారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ కవితలు ఎలాంటి బలాన్ని సంతరించుకున్నాయో ముందుమాటలో వరవరరావుగారు సవివరంగా సమీక్షించారు. కవితల్లోకి వెళ్ళడానికి ముందు, ఈ సమీక్ష చదివే పాఠకులకి ఒక ఆలోచనా వేదిక సిద్ధమౌతుంది. ఏ కవితా కూడా ఉబుసుపోక వ్రాసినట్లుగానీ, తేలిక భావాలతో వ్రాసినట్లు గానీ అనిపించదు. ప్రతి కవితలోనూ రచయిత భావతీవ్రత పస్ఫుటమౌతుంది. తోటిప్రయాణికుడ్ని మూగ అని గుర్తించిన కవి హృదయం ' పువ్వునుంచి పుప్పొడి రాలినట్లు / అస్పృశ్యత సోకని మేఘాలు / గగనంలో కలబోసుకున్నట్లు / అతను మాట్లాడుతడు' అని స్పందిస్తుంది. 'నాలో / కవిత్వమైన వాడికి / మాటలతో పనేమిటి' అని ముగిస్తారు. వెలుగు తగ్గిపోతున్న మాతృభాష గురించి వ్రాస్తూ 'సృజనకై / ఏ భాషలో ఆలోచిస్తవు? / ఆకలిగొన్న పులి ఎదురైందనుకో / గుప్పుమన్న భయం / తప్పించుకునే ఉపాయం / ఏ భాషలో రాసుకుంటవు?' అని ప్రశ్నిస్తారు. 'రెండు మెత్తని స్పీకర్ బిళ్ళలు / చెవుల నిండారా / జీవన వైశాల్యం అంతటా కమ్ముకుంటూ' వ్యాపిస్తున్న ఎఫ్.ఎమ్ సంస్కృతిని కూడా ఈ కవి తన కవితలో ఎక్స్‌రే తీసి చూపించారు. చదివి ఆలోచించాల్సిన కవితల సంపుటి ఈ ''పట్టుకుచ్చుల పువ్వు'

***

**For Copies:**
**Visalandhra, Sahachara,**
**Disha, Palapitta, Navodaya, Samantara**
**ebook : www.kinige.com**

**Writer:**
**Email : daasaraju@gmail.com**
**Cell : 9618224503**

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**